

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 27-05-2026 | సంపుటి - 27 | సంచిక -365 | రూ : 4 | పేజీలు: 8

## కబ్జాలపై
# హైడ్రా కొరడా



- కోకాపేట కొత్త చెరువుకు ఆక్రమణల నుంచి విముక్తి
- మరో 3 స్థలాలనూ స్వాధీనం చేసుకున్న అధికారులు
- ఒక్కరోజులోనే రూ.4,117 కోట్ల విలువైన స్థలాలకు కంచె

హైదరాబాద్: రాజధాని నగరంలో అత్యంత విలాసవంతమైన, విలువైన ప్రాంతం కోకాపేట. అక్కడ ఎకరా దాదాపు రూ.150 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల టీజీఐఐసీ వేలంలో ఎకరా రూ.177 కోట్లకు విక్రయించారు. అలాంటి తరువాయి 2లో



## ప్రతి నెలా..
# ఒకటో తేదీనే జీతాలు



- పంచాయతీలు సహా అన్ని శాఖల సిబ్బందికి అమలు
- పింఛనుదారులకు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో సొమ్ము
- కొత్త పెన్షన్ల మంజూరులో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం
- పంచాయతీల సొంత ఆదాయం బ్యాంకుల్లో జమ
- సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

2లో

## రుతుపవనాలపై ఐఎండీ అంచనా
# తలకిందులు!

- కేరళ తీరాన్ని తాకని నైరుతి రుతుపవనాలు
- జూన్ 2 నుంచి 4 మధ్య ప్రవేశించే అవకాశం
- ఐఎండీ తాజా అంచనాలు వెల్లడి
- ఉత్తరాదిలో తీవ్రమైన ఎండలతో ప్రజల ఇబ్బందులు
- ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం

2లో




## మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు..
# ‘విజయాల’ ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక



- కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంకు 12 ఏళ్లు పూర్తి
- దేశవ్యాప్తంగా ‘22 విజయాలు’ ప్రచారం చేసేందుకు బీజేపీ ప్రణాళిక
- ఇది సుపరిపాలన, అభివృద్ధి ప్రస్థానంగా అభివర్ణించిన కమలదళం
- ‘విధానాల పక్షవాతం’ నుంచి దేశం బయటపడిందని కేంద్ర మంత్రుల వ్యాఖ్య
- వికసిత భారత్ లక్ష్యానికి ఈ 12 ఏళ్ల పాలనే పునాది అని స్పష్టీకరణ

2లో

## చమురు దిగుమతుల్లో
# రష్యా ఆధిపత్యం



- భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యా అగ్రస్థానం
- మొత్తం దిగుమతుల్లో 36% పైగా వాటా రష్యాదేనని తెలిపిన గణాంకాలు
- ఇటీవల సౌదీ అరేబియాను వెనక్కి నెట్టి వెనెజులా మూడో స్థానానికి చేరిక
- అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ 40 దేశాలకు విస్తరించిన భారత దిగుమతి మార్గాలు

2లో



## అటు చర్చలు..
# ఇటు దాడులు

- ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా
- హెజ్‌బొల్లాలతో ఇజ్రాయెల్ సైన్యం ఘర్షణ

వాషింగ్టన్, టెహ్రాన్, బీరుట్: పశ్చిమాసియాలో శాంతి ఒప్పందానికి ఒకపక్క సన్నద్ధమవుతున్న అమెరికా మరోపక్క ఇరాన్‌పై భీకరంగా విరుచుకుపడింది. క్షిపణి ప్రయోగక్షేత్రాలను, సముద్రంలో మందుపాతరల్ని అమరుస్తున్న పడవల్ని లక్ష్యంగా చేసుకుని అగ్రరాజ్య సైన్యం మంగళవారం పెద్దఎత్తున దాడులకు దిగింది. ఇరాన్ దళాల ముప్పు నుంచి స్వీయరక్షణ కోసమే తమ బలగాలు ఈ దాడులు చేయాల్సి వచ్చిందని అమెరికా తరువాయి 2లో

## కశ్మీర్‌లో అల్లర్లు సృష్టించేందుకు
# లష్కరే సరికొత్త వ్యూహం!

- పీఓకే సరిహద్దుల్లో లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్య పెంచేందుకు కుట్ర
- చొరబాట్ల కోసం సరిహద్దుల్లో 500 మంది ఉగ్రవాదులు
- పాక్ రాజకీయ నేతలతో హాఫీజ్ సయీద్ కుమారుడి భేటీలు
- పీఓకేలో అభివృద్ధి నిరసనల నుంచి దృష్టి మళ్లించేందుకే ఎత్తుగడ

2లో





## గవర్నర్‌ను కలిసిన కవిత..
# రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

- భూ సేకరణ బాధితుల సమస్యలపై గవర్నర్‌ను కలిసిన కవిత
- ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక

2లో

# కబ్జాలపై హైడ్రా కొరడా

హైదరాబాద్: రాజధాని నగరంలో అత్యంత విలాసవంతమైన, విలువైన ప్రాంతం కోకాపేట. అక్కడ ఎకరా దాదాపు రూ.150 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల టీజీఐఐసీ వేలంలో ఎకరా రూ.177 కోట్లకు విక్రయించారు. అలాంటి ప్రాంతంలో ఆక్రమణలకు హైడ్రా చరమగీతం పాడింది. మంగళవారం భారీ ఆపరేషన్ చేపట్టి మొత్తం 4 స్థలాలను కబ్జా నుంచి విడిపించి కంచెలు వేసింది. ఒక్కరోజే దాదాపు రూ4,117 కోట్ల విలువైన స్థలాలకు విముక్తి లభించింది. కొన్ని ప్రముఖ స్థిరాస్తి సంస్థలు పక్కా ప్రణాళికతో కోకాపేట కొత్త చెరువును ఆక్రమించాయి. గోల్డ్‌ఫిష్ కాలనీ పేరుతో ఏర్పాటు చేసిన సంస్థ కోకాపేట కొత్తచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 1.09 ఎకరాలను ఆక్రమించింది. ఆ సంస్థ తనకున్న స్థలంలో విల్లాలను నిర్మాణం చేసి చెరువును మట్టితో పూడ్చి వేసి ఓపెన్ ఏరియాగా మార్చింది. దీనిలో గార్డెన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ఆట స్థలాలను ఏర్పాటు చేసింది. ఇదంతా పూర్తిగా ఎఫ్‌టీఎల్ పరిధిలో చేసినట్లు హైడ్రా గుర్తించింది. దీనిపై ప్రజావాణిలో ఫిర్యాదులు రావడంతో దస్త్రాలను హైడ్రా పరిశీలించి ఎఫ్‌టీఎల్‌ను గుర్తించింది. గోల్డ్ ఫిష్ విల్లాలకు చెందిన ఆటస్థలాలను హైడ్రా తొలగించి కంచె వేసింది. కోకాపేట పెద్దచెరువు మొత్తం విస్తీర్ణం 72 ఎకరాలు. ఇందులో 20 ఎకరాల్లో చెరువును ఆక్రమించి ఎగువ భాగంలో వివిధ సంస్థలు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నాయి. గోల్డ్ ఫిష్ విల్లాలకు చెందిన ఆటస్థలాలను హైడ్రా తొలగించి కంచె వేసింది. అలా సుమారు 22 ఎకరాల వరకు చెరువు స్థలాన్ని కాపాడింది. ఈ చెరువు స్థలం విలువ దాదాపు రూ.3 వేల కోట్ల పైమాటే.

**ఈదులకుంటలో 6.50 ఎకరాలు**

ఐటీ కారిడార్ పరిధిలో ఏకంగా ఒక చెరువునే మాయం చేసేందుకు రియల్టర్లు చేసిన ప్రయత్నాన్ని హైడ్రా భగ్నం చేసింది. దాదాపు 6.50 ఎకరాలను కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 7లో ఈదులకుంట చెరువు ఉండేది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువు నిండితే.. వరద కాలువ ద్వారా నీరు ఈదులకుంట చెరువులోకి చేరుతుంది. కబ్జాదారులు ఈ వరద కాలువను పక్కా ప్రణాళికతో ఇతర ప్రాంతాలకు మళ్లించారు. దీంతో నీరు లేకుండా చెరువు ఎండిపోయింది. దీన్ని ఆక్రమించి ఆకాశహర్మ్యాల నిర్మాణానికి పక్కా ప్రణాళిక రూపొందించారు. స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా ఆధారాలు సేకరించి చెరువును గుర్తించింది. దీనిపై ఎన్‌జీటీలోనూ కేసు నమోదైంది. శాటిలైట్ చిత్రాల ద్వారా ఎఫ్‌టీఎల్ సరిహద్దులు గుర్తించి కంచె వేసింది. చెరువును అభివృద్ధి చేయనున్నట్లు హైడ్రా ప్రకటించింది. దీని విలువ సుమారు రూ.600 కోట్ల వరకు ఉంటుంది. ఈదులకుంట చెరువు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కూడా హైడ్రా కాపాడింది. చెరువును ఆనుకుని సర్వే నంబరు 11/37లో 5.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిపై కన్నేసిన కబ్జారాయుళ్లు సర్వే నంబరు 1003 నుంచి 1006 వరకు ఇదే భూమిగా చూపిస్తూ నిర్మాణ అనుమతుల కోసం 2022లో దరఖాస్తు చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా.. అక్రమార్కులు సర్వే నంబర్లు మార్చివేసి నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించి కంచె వేసింది. దీని విలువ రూ.500 కోట్లు.

**పరిహారం తీసుకుని కబ్జా..**

రహదారి విస్తరణకు ఇచ్చిన భూమికి పరిహారం తీసుకున్న యజమానే కబ్జా చేసిన ఉదంతాన్ని హైడ్రా వెలుగులోకి తెచ్చి స్థలాన్ని కాపాడింది. భరత్‌నగర్, ఖైతలాపూర్, హాఫీజ్‌పేటను కలుపుతూ సాగే రహదారి ట్రాఫిక్ అవసరాలకు సరిపోవడం లేదు. దీంతో రెయిన్‌బో విస్టా మీదుగా రైల్వే‌ట్రాక్‌కు చేరువలో 100 అడుగుల రహదారి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించి భూసేకరణ చేపట్టింది.

# అటు చర్చలు..ఇటు దాడులు

వాషింగ్టన్, టెహ్రాన్, బీరుట్: పశ్చిమాసియాలో శాంతి ఒప్పందానికి ఒకపక్క సన్నద్ధమవుతున్న అమెరికా మరోపక్క ఇరాన్‌పై భీకరంగా విరుచుకుపడింది. క్షిపణి ప్రయోగక్షేత్రాలను, సముద్రంలో మందుపాతరల్ని అమరుస్తున్న పడవల్ని లక్ష్యంగా చేసుకుని అగ్రరాజ్య సైన్యం మంగళవారం పెద్దఎత్తున దాడులకు దిగింది. ఇరాన్ దళాల ముప్పు నుంచి స్వీయరక్షణ కోసమే తమ బలగాలు ఈ దాడులు చేయాల్సి వచ్చిందని అమెరికా సైన్యం సెంట్రల్ కమాండ్ కెప్టెన్ టిమ్ హాకిన్స్ సమర్థించుకున్నారు. తీరం వెంట ఉన్న ఇరాన్ క్షిపణి స్థావరాలు తమ దేశానికి చెందిన రెండు విమానవాహక నౌకలు, రెండు డజన్లకు పైగా యుద్ధ నౌకలకు ముప్పుగా పరిణమించినట్లు వివరించారు. తమ దాడిలో బందర్ అబ్బాస్ పోర్టులోని నౌకాదళ స్థావరం ధ్వంసమైనట్లు చెప్పారు. ఇరాన్‌లోని లర్క్ ద్వీపంలో కనీసం నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. దాడుల్లో ఇజ్రాయెల్ కూడా పాల్గొన్నట్లు సమాచారం. ఇరాన్ మద్దతు ఉన్న హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపుపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. లెబనాన్‌ఇజ్రాయెల్ మధ్య వాషింగ్టన్‌లో మరో మూడురోజుల్లో ప్రత్యక్ష చర్చలు జరగనున్న తరుణంలో ఇది చోటుచేసుకుంది. దాడుల్లో 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దళాలపై తామూ దాడులు చేసినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. అమెరికా దాడుల్ని ఇరాన్ ఖండించింది.

# ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు

హైదరాబాద్:రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజికఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చమురు దిగుమతుల్లో రష్యా ఆధిపత్యం

ఢిల్లీ : అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, పశ్చిమ దేశాల ఆంక్షలు ఉన్నప్పటికీ, భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యా తన అగ్రస్థానాన్ని పదిలంగా కాపాడుకుంటోంది. 2024 నుంచి 2026 వరకు వెలువడిన గణాంకాల ప్రకారం, దేశం దిగుమతి చేసుకుంటున్న మొత్తం ముడి చమురులో మూడింట ఒక వంతుకు పైగా రష్యా నుంచే వస్తోంది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారుగా ఉన్న భారత్, తన అవసరాల్లో 80% పైగా విదేశీ సరఫరాలపైనే ఆధారపడి ఉంది. ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం, 2024లో భారత్ రోజుకు సుమారు 4.8 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకోగా, అందులో 36.7% వాటాతో రష్యా (రోజుకు 1.7 మిలియన్ బ్యారెళ్లు) మొదటి స్థానంలో నిలిచింది. ఇరాక్ (1 మిలియన్ బ్యారెళ్లు), సౌదీ అరేబియా (6,22,000 బ్యారెళ్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఈ సరఫరా మార్గాల్లో ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. 2026 మే నెలలో రష్యా, యూఏఈ తొలి రెండు స్థానాల్లో కొనసాగగా, సౌదీ అరేబియాను వెనక్కి నెట్టి వెనెజులా మూడో అతిపెద్ద సరఫరాదారుగా అవతరించడం గమనార్హం. తక్కువ ధరలకు లభిస్తుండటమే రష్యా నుంచి భారీ కొనుగోళ్లకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇంధన భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా, భారత ప్రభుత్వం తన వ్యూహాలను వైవిధ్యభరితం చేస్తోంది. సుమారు 40 దేశాల నుంచి ముడి చమురును కొనుగోలు చేస్తూ, ఏ ఒక్క దేశంపైనా లేదా మార్గంపైనా ఆధారపడకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ వివరాలను రాయిటర్స్, పీపీఏసీ, కెప్లర్ వంటి అంతర్జాతీయ సంస్థల నివేదికలు ధ్రువీకరించాయి.

# రుతుపవనాలపై ఐఎండీ అంచనా తలకిందులు!

కేరళ : దేశవ్యాప్తంగా రైతులు, ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానుంది. మే 26న కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముందుగా అంచనా వేసినప్పటికీ, అందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని తెలుస్తోంది. దీంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా ఆలస్యంగా, అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు సూచిస్తున్నాయి. రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించడానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు అవసరం. కేరళలోని 14 కేంద్రాలలో కనీసం 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజుల పాటు 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. దీంతో పాటు గాలి వేగం, మేఘాల సాంద్రత వంటివి కూడా అనుకూలంగా ఉండాలి. అయితే, మే 25 నాటికి ఈ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, అలప్పుళ, ఎర్నాకుళం జిల్లాల్లో సాధారణంగా కురిసే తొలకరి జల్లులు పడుతున్నాయి. ఒకవైపు రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండగా, మరోవైపు ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశంలో తీవ్రమైన వేడిగాలులు ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఢిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. రుతుపవనాలు కేరళను తాకిన తర్వాత కూడా, ఉత్తర దిశగా వాటి కదలిక నెమ్మదిగా, తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, కొన్ని రోజుల ఆలస్యం పెద్ద సమస్య కాకపోయినా, మొత్తం సీజన్‌లో వర్షపాతం ఎలా ఉంటుందనేది ఆందోళన కలిగిస్తోంది. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం వాటా అందించే నైరుతి రుతుపవనాల కదలికపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

# మోదీ సర్కార్‌కు 12 ఏళ్లు.. 'విజయాల' ప్రచారానికి బీజేపీ భారీ ప్రణాళిక

ఢిల్లీ :ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిన్నటితో 12 సంవత్సరాలు పూర్తయింది. ఈ దశాబ్ద కాలానికి పైబడిన ప్రస్థానాన్ని సుపరిపాలన, అభివృద్ధి, జాతీయ పరివర్తనకు చిరునామాగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభివర్ణించింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తమ ప్రభుత్వం సాధించిన '22 ముఖ్యమైన విజయాలను' ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ముఖ్యమంత్రులు, ఎంపీలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ 12 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ, ఆర్థిక సంస్కరణలు, డిజిటల్ పాలన, విదేశాంగ విధానంలో సాధించిన విజయాలు, సామాజిక రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రచారం ద్వారా ప్రజలకు వివరించనున్నారు.

*** 'సంకల్పం నుంచి సాఫల్యం' యాత్రగా అభివర్ణించిన నితిన్ నబిన్**

ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ 12 ఏళ్ల ప్రస్థానాన్ని 'సంకల్పం నుంచి సాఫల్యం వరకు' సాగిన యాత్రగా అభివర్ణించారు. "2014 మే 26న ప్రారంభమైన ఈ శకం కేవలం ప్రభుత్వ మార్పు కాదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం తిరిగి పొందిన ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రక ఘట్టం" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే మంత్రంతో పాటు అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వం పాలన సాగించిందని, సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చిందని అన్నారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమతుల్యం చేశారని, ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపడం ద్వారా దేశం ఇప్పుడు మరింత సురక్షితంగా ఉందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణానికి ఈ 12 ఏళ్ల పాలనే బలమైన పునాది అని ఆయన పేర్కొన్నారు.

**మోదీ ఒక నిజమైన 'ప్రధాన్-సేవక్': రాజ్‌నాథ్ సింగ్**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ.. 2014 మే 26న భారతదేశ అభివృద్ధి, నాగరిక ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని అన్నారు. "ఆర్థికాభివృద్ధి, సామాజిక సంక్షేమం నుంచి ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ పరివర్తన వరకు, మౌలిక సదుపాయాల నుంచి బలమైన జాతీయ భద్రత వరకు ప్రతి రంగంలోనూ దేశం అపూర్వమైన వేగంతో పురోగమించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. దేశ వృద్ధి ఇప్పుడు మరింత విస్తృతమైనదిగా, సమ్మిళితమైనదిగా మారిందన్నారు. దశాబ్దాలుగా తెరమరుగైన కోట్లాది మంది ప్రజలు దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యారని, మోదీ ఒక నిజమైన 'ప్రధాన్‌సేవక్' అని కొనియాడారు.

*** ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం': శివరాజ్ సింగ్ చౌహాన్**

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గడిచిన 12 ఏళ్లు సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి అంకితమైనవని అన్నారు. ఒకప్పుడు దేశం ఎదుర్కొన్న 'విధానాల పక్షవాతం' నుంచి బయటపడి 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' (Reform, Perform, Transform) మంత్రంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కాలాన్ని భారతదేశ పునర్నిర్మాణానికి, ప్రజా సంక్షేమానికి ఒక 'స్వర్ణయుగం'గా అభివర్ణించారు. జన్ ధన్ ఖాతాల నుంచి ఆయుష్మాన్ భారత్ వరకు, పీఎం ఆవాస్ యోజన నుంచి డిజిటల్ ఇండియా వరకు ఎన్నో పథకాలతో ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమాలలో కొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు.

## పంజాబ్ స్థానిక సంస్థల ఎన్నికలు

# 'ఆప్'కు అగ్నిపరీక్ష

ఢిల్లీ :పంజాబ్‌లో వచ్చే ఏడాది (2027) ప్రారంభంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (AAP)కి మున్సిపల్ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి. రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీల పరిధిలోని మొత్తం 1,896 వార్డుల కౌన్సిలర్ల ఎన్నిక కోసం మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ ప్రారంభమైంది. మొత్తం 35.45 లక్షల మంది ఓటర్లు సాయంత్రం 5 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా, అంతకంటే ముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టారు. ఎక్కడా పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైనట్లు నివేదికలు లేవని రాష్ట్ర ఎన్నికల అధికారి ఒకరు తెలిపారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సుమారు 32,000 మంది పోలీసులను, 35,000 మంది ఎన్నికల సిబ్బందిని నియమించింది. అబోహర్, మొహాలీ, మోగా, బటిండా, బర్నాలా, బటాలా, కపుర్తలా, పఠాన్‌కోట్ నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతున్నాయి. బరిలో ఉన్న మొత్తం 7,555 మంది అభ్యర్థుల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందినవారు 1,801 మంది, కాంగ్రెస్ నుంచి 1,550 మంది, బీజేపీ తరఫున 1,316 మంది, శిరోమణి అకాలీదళ్ నుంచి 1,251 మంది, బహుజన్ సమాజ్ పార్టీ (BSP) కి చెందినవారు 96 మంది కాగా, 1,528 మంది స్వతంత్రులు, మరో 13 మంది ఇతర అభ్యర్థులు ఉన్నారు. ఓటర్లలో 18,33,712 మంది పురుషులు, 17,11,635 మంది మహిళలు, 220 మంది 'ఇతర' కేటగిరీ ఓటర్లు ఉన్నారు.

**బ్యాలెట్ పేపర్లకే కోర్టుల గ్రీన్ సిగ్నల్**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (EVMs) స్థానంలో బ్యాలెట్ పేపర్లను ఉపయోగించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్ (PIL)ను పంజాబ్, హరియాణా హైకోర్టు డివిజన్ బెంచ్ తోసిపుచ్చింది. మే 13నే ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రక్రియ చివరి దశకు చేరిన తరుణంలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని మే 22న కోర్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించింది. అన్ని ఏర్పాట్లు పూర్తయినందున తాము జోక్యం చేసుకోలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

**రాజకీయ విమర్శలు.. ప్రచారం**

ఎన్నికల్లో గెలవడానికి ప్రభుత్వం ఎలాంటి అక్రమ మార్గాలను ఉపయోగించినా సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జాఖర్ హెచ్చరించారు. పోలింగ్ బూత్‌ల తలుపులు మూసేస్తామంటూ ఆప్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు వారి నిరాశను తెలియజేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నేరుగా ప్రచారం చేయకపోయినప్పటికీ.. ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ అభ్యర్థుల తరఫున ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. మరోవైపు, 2021 స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో తమ బలం నాటకీయంగా పెరిగిందని బీజేపీ భావిస్తోంది. గతంలో నిరసనలు ఎదుర్కొన్న చోట, ఇప్పుడు బీజేపీ టికెట్ల కోసం అభ్యర్థులు క్యూ కట్టారని, ఎక్కడా ఎలాంటి నిరసనలు ఎదురుకాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. మున్సిపల్ కౌన్సిల్, నగర పంచాయతీ ఎన్నికల కోసం 1,226 మందిని, ఎనిమిది మున్సిపల్ కార్పొరేషన్ల కోసం 367 మంది అభ్యర్థులను బీజేపీ బరిలోకి దించింది. ప్రస్తుతం బీజేపీకి పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ పంజాబ్‌లోనూ మద్దతు పెరుగుతోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

# కశ్మీర్‌లో అల్లర్లు సృష్టించేందుకు లష్కరే సరికొత్త వ్యూహం!

కశ్మీర్ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చి అలజడి సృష్టించేందుకు ఉగ్రవాద సంస్థ 'లష్కరే తోయిబా' సరికొత్త కుట్రలకు తెరలేపింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచడం, అదే సమయంలో ప్రచార యుద్ధాన్ని ఉద్ధృతం చేయడం అనే ద్విముఖ వ్యూహంతో ముందుకు వెళుతున్నట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మేరకు పాక్ రాజకీయ ప్రముఖులతో లష్కరే అగ్రనాయకత్వం వరుసగా జరుపుతున్న భేటీలు భారత ఏజెన్సీల నిఘాలో పడ్డాయి.

**చొరబాట్ల కోసం 500 మంది**

ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడటానికి పీఓకే సరిహద్దుల్లో దాదాపు 500 మందికి పైగా లష్కరే ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల భారత భద్రతా దళాల అప్రమత్తత కారణంగా ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాలన్నీ విఫలమవడంతో లష్కరే నాయకత్వం తీవ్ర అసహనంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే లాంచ్‌ప్యాడ్‌ల సంఖ్యను పెంచి, అక్కడ ఉగ్రవాదుల సంఖ్యను వెయ్యికి చేర్చాలని పీఓకేలో జరిగిన ఓ కీలక సమావేశంలో లష్కరే నిర్ణయించినట్లు గుర్తించారు.

**వ్యూహం మార్చిన ఉగ్రసంస్థ**

భారత సైన్యాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేయడమే లక్ష్యంగా చొరబాటు యత్నాల సంఖ్యను అనేక రెట్లు పెంచాలని ఉగ్రవాదులు భావిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. 26 మంది ప్రాణాలు బలిగొన్న పహల్గామ్ దాడికి లష్కరే అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' కారణం కాగా.. ఆ తర్వాత భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో మురిద్కేలోని లష్కరే ప్రధాన శిక్షణా కేంద్రం పూర్తిగా ధ్వంసమైంది. ఆ దెబ్బ నుంచి కోలుకోవడానికే ఉగ్రవాదులు ఇప్పుడు మళ్లీ యత్నిస్తున్నారు.

**రాజకీయ నేతలతో భేటీలు**

లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ గత వారం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత ఆప్తుడైన రాణా సనావుల్లాతో భేటీ కావడం సంచలనం సృష్టించింది. ఈ సమావేశంలో లష్కరే కొత్త ప్లాన్స్, లీడర్‌షిప్ మార్పుల గురించి చర్చ జరిగినట్లు తెలుస్తోంది. హాఫీజ్ సయీద్‌ను కేవలం సిద్ధాంతకర్తగా ఉంచి, యువకుడైన తల్హా సయీద్ సంస్థ బాధ్యతలు అధికారికంగా చేపట్టాలని పాక్ పాలకవర్గం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ నిరసన




జనగామ, ప్రజాస్ఫూర్తి: కేంద్రం లోని భాజపా ప్రభుత్వం కార్పొ రేట్ ఆయిల్ కంపెనీలకు అనుకూలం గా వ్యవహరిస్తూ ప్రజల పై భారాలు మోపుతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని మంగళవారం సిపిఐ ఆధ్వర్యం లో జిల్లా కేంద్రం లోని అంబే ద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ వంటి నిత్యావసర వినియోగ వస్తువుల ధరల పెంపుతో రైతులు, కార్మికు లు, పేద ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రభుత్వం విరమించుకోకపోతే ప్రజలు తిరుగు బాటు చేసే పరిస్థితులు తలెత్తుతా యని హెచ్చరించారు. ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఐక్య పోరాటమే మార్గమని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు మోటే శ్రీశైలం, చామకూర యాకుబ్, దాయా నగేష్, ఉప్పలయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మాక్ పార్లమెంట్‌తో నాయకత్వ లక్షణాల పెంపు

**: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**




భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : చిన్నారుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్నేహ బాలల హక్కుల సదస్సు" మరియు "మాక్ పార్లమెంట్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి సమాజాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ, డీడబ్ల్యూవో మల్లీశ్వరి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగిలి చిరు వ్యాపారి మృతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండలంలోని తొమ్మిది గుడిసెల పల్లె గ్రామానికి చెందిన మాదంశెట్టి రాజన్న(69) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య మాదంశెట్టి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని తొమ్మిది గుడిసెలపల్లి గ్రామానికి చెందిన మాదంశెట్టి రాజన్న అనే చిరు వ్యాపారి ఉదయం భోజనం చేసిన అనంతరం కిరాణా షాపుకు వెళ్తానని చెప్పి ఇంటి నుండి కిరాణా షాపుకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ముత్యం రాజలింగు ఇంటికి సమీపంలో స్పృహ కోల్పోయి పడిపోయి ఉన్నందున ముత్యం కృష్ణ అనే వ్యక్తి కింద పడిన మాదంశెట్టి రాజన్నను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా,ఆయన భార్య పద్మ, కూతురు రేగొండ లత అక్కడికి వెళ్లి ఎండతీవ్రత కు కిందపడ్డ రాజన్నను ఇంటికి తీసుకెళ్లి పడుకోబెట్టగా అప్పటికే చనిపోయాడు.వడదెబ్బ తగిలి చనిపోయాడని మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా ఎస్టీలను మోసం చేస్తోంది

**: హరీశ్‌రావు**



హైదరాబాద్: చిన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లంబాడీల ఆత్మగౌరవం నిలబెట్టింది కేసీఆర్ అని తెలిపారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా జరిపామన్నారు. బంజారాహిల్స్‌లో బంజారాలకు ఆత్మగౌరవ భవనం కట్టించామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''టీఎస్ ప్రైడ్ ద్వారా 13,200 మందికి ఉద్యోగాలిచ్చాం. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినుల కోసం డిగ్రీ కళాశాలలు కట్టించాం. సేవాలాల్, కుమురం భీం, ఏకలవ్య కార్పొరేషన్లకు ఇప్పటి ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదు. ఎస్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా మోసం చేస్తోంది'' అని విమర్శించారు.

# పురపాలకలో సాధారణ సర్వసభ సమావేశం

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట సభ్యులకు ఎజెండా అంశాలను చదివి వినిపించడం జరిగింది. అనంతరం కౌన్సిలర్స్ మహమ్మద్ గౌస్ కురిషి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా చమన్ నుంచి దయారా రోడ్డు విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే వేసినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ అండ్ బి అధికారులు అలసత్వం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజల సమస్యలను తీర్చాలని ఆయన కోరారు. కౌన్సిలర్ చింతల స్వర్గిణి మాట్లాడుతూ



ప్రతి సారి వర్షాల కారణంగా పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వర్షానికి నీరు భవనాన్ని చుట్టూ ముట్టడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నరాని అన్నారు. అక్కడి ప్రిన్సిపాల్ రోజు తన ఫోన్ చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. బుజరంపేట అరుణ మాట్లాడుతూ వార్డ్ కి కలెక్టర్ వచ్చిన సమయంలో తన ను గుర్తింపు లేకుండా మున్సిపల్ అధికారులు ప్రవర్తించారని ఇలాంటి చర్యలకు మాతో సరి చేస్తూ తనను చులకన చేస్తే మాజీ లకు వార్డు లో పనేంటి ప్రశ్నించారు. ఇలాంటి చులకన చేస్తే చర్యలను మరో సారి చేస్తే అధికారుల పేర్లు రాసి చనిపోతానని హెచ్చరించారు. కౌన్సిలర్ మాయ గంగామణి మాట్లాడుతూ వార్డ్ లో మున్సిపల్ అధికారులు పనులు చేసే ముందు స్థానిక కౌన్సిలర్స్ కు సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. అలా చేయడం వల్ల అధికారులు పనులు చేయకున్నా కూడా బిల్లు పెట్టే ఆస్కారం ఉందని అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. కౌన్సిలర్ బట్టి ఉదయ్ మాట్లాడుతూ ప్రవేశపెట్టిన ఎజెండా అంశాలు అన్ని కూడా కాపీ పేస్ట్ ల ఉన్నాయని అన్నారు. మున్సిపల్ చరిత్రలోనే ఇంత పెద్ద ప్రియంబుల్స్ ప్రవేశపెట్టింది ఇదే కావొచ్చని అన్నారు. వార్డుల్లో పనులు చేస్తే కనీసం కౌన్సిలర్స్ కు సమాచారం ఇవ్వడం లేదని అధికారుల తీరు పైన మండిపడ్డారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ కౌన్సిలర్స్ అడుగుతున్న ప్రశ్నలకు డీఈ సమాధానం చెప్పడం మర్యాదగా లేదని, పద్ధతి మార్చుకుంటే మంచిదని లేదా పని చేసే ఉద్దేశ్యం లేకుండా మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో గుడుంబా నల్ల బెల్లం పట్టిక పై ఆకస్మిక తనిఖీలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున "కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం"నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు సుమారు 120 ఇండ్లు, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్ల బెల్లం,20 లీటర్ల గుడుంబా, 20 కిలోల పట్టిక,16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల అనంతరం గ్రామస్తులను సమీకరించి దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈతకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్, ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బహిరంగంగా మద్యం సేవించడం

# అసాంఘిక చర్య – దీనిని చట్టం ఉపేక్షించదు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు నాలుగు పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి సూర్యాపేట పట్టణ శివార్లలో బహిరంగ ప్రదేశాలలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి అసాంఘిక చర్యను నిర్మూలించడమే లక్ష్యంగా విస్తృతంగా సోధాలు నిర్వహించడం జరిగిందని సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. ఈ తనిఖీల కోసం డ్రోన్ కెమెరాలు సమర్థవంతంగా ఉపయోగించాం అన్నారు. ఈ తనిఖీల్లో 10 కేసులు నమోదు చేశామని చెప్పారు. బహిరంగంగా మద్యం సేవించడం అనేది ఒక అసాంఘిక చర్య మరియు సామాజిక దురాచారం. ఇలాంటి చర్యలను సమాజం హర్షించదు, చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ఆ మార్గంలో వెళ్లే సామాన్యులకు, ముఖ్యంగా మహిళలకు, చిన్న పిల్లలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, దీనిని అరికట్టేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసిందని సూర్యాపేట పట్టణ ఇన్స్‌పెక్టర్ తెలిపారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు సూర్యాపేట పట్టణ పోలీసులు ఈరోజు కొత్త వ్యవసాయ మార్కెట్ ఏరియా, అమ్మ గార్డెన్ ఏరియా, పుల్లారెడ్డి చెరువు ఏరియా, ఈనాడు ఆఫీస్ వెనకాల, సద్దల చెరువు ఏరియా చుట్టుపక్కల ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రోన్ కెమెరాలతో సోదాలు నిర్వహించారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తున్నారా, పేకాట లాంటి అసాంఘిక చర్యలు పాల్పడుతున్నారా అనే విషయాన్ని పర్యవేక్షించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాము. నేరం రుజువైతే జైలు శిక్షలు కూడా తప్పవు" అని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా యువత ఈ విషయాన్ని గమనించి పోలీసులకు మరియు సమాజానికి సహకరించాలని కోరారు. ఇలాంటివి ఎక్కడైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర్ నాథ్, శివతేజ, వెంకన్న లు నాలుగు బృందాలను నడిపించారు. సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి గింజను ప్రభుత్వం కొంటుంది

- **ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నాం**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ధాన్యం కొనుగోలు మంగళవారం వరకు 2,65,639.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 54,885 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 38,402 మంది రైతుల అకౌంట్ లో 423,52 కోట్ల రూపాయలు జమ చేశామనీ జిల్లా కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్-అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, 24 గంటల పాటు అధికారులు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని, జిల్లా యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వలిగొండ మండల కేంద్రంలో మహిళా వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్యా ప్రాధాన్యత, చట్టపరమైన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు.అందరూ కలిసి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు తమ వంతు కృషి చేస్తామని సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో వలిగొండ మండల తహశీల్దార్ దశరథ నాయక్ ,ఐసిడిఎస్ రామన్నపేట ప్రాజెక్టు సిడిపిఓ వెంకటరమణ,వలిగొండ సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి , అంగన్వాడి సూపర్వైజర్ ధనమ్మ, పారిజాత, పురోహితులు నందిబట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి, ఆంజనేయులు, నందిబట్ల శ్రీకర్, ఏపీఎం అంజయ్య, అంగన్వాడి టీచర్లు తదితరులు హాజరయ్యారు.

# ఉపకారవేతనాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

**: అభివృద్ధి అధికారి విక్రమ్**

జనగామ, ప్రజాస్ఫూర్తి : 2026 - 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకారవేతనాల కోసం ఎస్సీ విద్యార్థు లు దరఖాస్తు చేసుకునేందుకు మే 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్ మంగళవారం ఒక ప్రక టన ద్వారా తెలిపారు. అర్హత కలిగిన ఎస్సీ విద్యార్థులు సంబంధిత ధృవ పత్రాల తో ఆన్ లైన్ లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం తెలంగాణ ఈపాస్ వెబ్ సైట్ telanganaepass.cgg.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా తక్షణమే తమ పేర్ల ను నమోదు చేసుకుని ఉపకార వేతనాల ప్రయోజనాన్ని పొందాలని కోరారు

# ఎస్ జి ఓ జగిత్యాల జిల్లా కమిషనర్ గా మండల వాసి



ప్రజాస్ఫూర్తి , జన్నారం: స్కాట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్ (ఎస్ జీ ఓ) జగిత్యాల జిల్లా కమిషనర్ గా జన్నారం మండలం కామన్ పల్లి గ్రామానికి చెందిన పేరం మహేందర్ నియమితులయ్యారు. నేషనల్ కమిషనర్ ఆఫ్ ఇండియా సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన నియామకానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర కమిషనర్ అశోక్ రాజ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో స్కాట్స్ అండ్ గైడ్స్ విభాగం బలోపేతానికి విద్యార్థులలో క్రమశిక్షణ, స్వభావాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని అన్నారు. జగిత్యాల జిల్లా ఎస్ జీ ఓ కమిషనర్ గా ఎన్నికైనందుకు ఆయనను పలువురు అభినందించారు. తనపై నమ్మకంతో బాధ్యత ను అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీలకు పేరం మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన కొత్తగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మచిలీపట్నంకు చెందిన తోట రాంబాబు (55) స్థానిక బర్లిఫీట్‌లోగల రెస్టారెంట్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లిన రాంబాబు ఝాన్సీ హాస్పిటల్ దగ్గర పడిపోయి కన్పించడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్ పరీక్షించి అప్పటికే రాంబాబు చనిపోయినట్లు తెలిపారు. మంగళవారం మృతదేహాన్ని పోస్టుమార్ట నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతునికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఎవరికైనా సమాచారం తెలిస్తే 8712682017, 8712682020 నెంబర్లను సంప్రదించాలని సీఐ సూచించారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : భూభాతి దర ఖాస్తుల పరిష్కార ప్రక్రియలో మరింత వేగం పెంచి పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రతి మంగళవారం నిర్వ హించే భూభారతి సమీక్ష సమావేశంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్ షాలోంతో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లతో అయన సమీక్ష సమావే శం నిర్వహించారు.ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ జిల్లా లో భూభారతి దర ఖాస్తుల పరిష్కారానికి తహసీల్దా ర్లు, సిబ్బంది విస్తృ తంగా కృషి చేస్తు న్నారని అభినందించారు. అనంతరం మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. భూభారతి పోర్టల్ లోని సక్సెషన్, మ్యు టేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితర మాడ్యూల్స్ కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో ఇంకా వేగం పెంచి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు.ఈ సమావేశం లో ఆర్డీఓ గోపీరాం,అన్ని మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలి

: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి: జిల్లా లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారు లను ఆదేశించారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ లో మెప్మా ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం, అదే మండలం లోని నమిలి గొండ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం,అలాగే జఫర్ ఘడ్ మండలం కూనూరు గ్రామం లోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఎన్ని టోకెన్లు జారీ చేశారో, ఇప్పటి వరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యం తరలిం చాయో, ఏ మిల్లులకు ఎప్పుడు పంపిం చారో, ట్రక్ షీట్ లో వివరాలు సక్రమం గా నమోదు చేశారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓపీ ఎంఎస్ నమోదుల వివరాలను కూడా పరిశీలించారు. టోకెన్ జారీ నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి టోకెన్ కు అనుగు ణంగా ఎన్ని వాహనాలు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు.ప్రతి మిల్లుకు వాహనాలు బయలుదేరిన సమయం,మొత్తం వెళ్లిన లారీల సంఖ్య, ట్రక్ షీట్ వివరాలు సరి పోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలు, వాహనాల ఎంట్రీలను నిరంతరం నవీకరించాలని సూచించారు. ధాన్యం తేమ శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి నాణ్యత ప్రమాణాలు పాటించా లని,కొనుగోలు ప్రక్రియలో ఎటు వంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చే యాలని ఆదేశించారు. నమిలిగొండ ఐకేపీ కేంద్రంలో గన్ని సంచుల లభ్యత, కాంటా పూర్తయిన తర్వాత మిగిలిన ధాన్యం బస్తాల వివరాలు, రిజిస్టర్ నిర్వ హణ తదితర అంశాలను పరిశీలించా రు. ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్య పై ఆరా తీసి, అవసరమైతే అదనపు హమాలీలను ఏర్పాటు చేసి లో డింగ్, అన్లోడింగ్ పనులను వేగవం తం చేయాలని సూచించారు. రవాణా ఆలస్యం కాకుండా ట్రక్కులు, డీసీఎంల ద్వారా ధాన్యాన్ని త్వరితగతిన తరలిం చాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. కాంటా వద్ద 41 కిలోల ప్రకారం తూకం వేయా లని, ధాన్యం నిల్వకా కుండా కేంద్రాల నిర్వహణ సమర్థంగా ఉండాలని తెలిపారు. పీఏసీఎస్ కూనూరు కేంద్రంలో డీసీఎంల ద్వారా ధాన్యం తరలింపు పరి స్థితిని పరిశీలిం చిన కలెక్టర్, తక్ష ణమే రెండు లారీలను కేంద్రానికి పంపించాలని ఆర్డీఓకు సూ చించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల పనితీరు ను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతమైన చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

# కాళేశ్వర పుష్కర స్నానంలో దేవాదాయ కమిషనర్

* కాళేశ్వరంలో ఏర్పాట్లపై సంతృప్తి.. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం

జయశంకర్ భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు కమిషనర్ కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించగా, పార్వతీదేవి ఆలయంలో ప్రత్యేక అర్చనలు చేశారు. అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో స్వామి దర్శనం వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రత, భద్రత, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏడీసీఎం కృష్ణవేణి, ఆర్జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ ఆర్.సునీత, ఆలయ ఈవో ఎస్. మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

* జిల్లా కలెక్టర్ కె. హరిత



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: జూన్ 1వ తేదీన కొమరంభీం ఆసిఫాబాద్ మండలం కొలం కొరారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు.మంగళవారం కెరమెరి మండలం కోలం కొరారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ (ఆర్డిఓ) లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు.ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు.అదేవిధంగా, సభకు విచ్చేసే ప్రజలకు మరియు లబ్ధిదారులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల విక్రయదారులపై టాస్క్ ఫోర్స్ పోలీసుల మెరుపు దాడులు

: నలుగురు అరెస్ట్, 6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలు, వాహనం స్వాధీనం.



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : వికారాబాద్ జిల్లాలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై టాస్కోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు, టాస్కోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్కె అన్వార్ పాషా ఆధ్వర్యంలో విడివిడిగా జరిపిన రెండు వ్యూహాత్మక దాడులలో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మొదటి దాడిలో, పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం రావులపల్లి వద్ద నిఘా ఉంచి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నిషేధిత, నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న బాపట్ల జిల్లా కు చెందిన ఉప్పలపాటి వసంత రావు (37) పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి 2.5 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన ఆక్టివా జూపిటర్ వాహనాన్ని (నెంబర్: కెఎ 33 ఈఈ 1467) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడైన యాణగుంది (కర్ణాటక రాష్ట్రం సేడం గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొడంగల్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. అదేవిధంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్ కె అన్వార్ పాషా నేతృత్వంలో జరిగిన రెండో దాడిలో.. దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో కర్ణాటక రాష్ట్రం సేడంగ్రామానికి చెందిన పునాకాల సురేష్ (40) , చందాపుర్కు చెందిన కళ్యాణ్ వీరేష్ (43) వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ కు చెందిన తలారి వేణు (35) ఉన్నారు. వీరి నుంచి సుమారు 4.2 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలను టాస్క్ ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకుని ఈ ముగ్గురు నిందితులను, విత్తనాలను తదుపరి దర్యాప్తు కోసం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు. మొత్తం మీద ఈ రెండు దాడుల్లో కలిపి 6.7 క్వింటాళ్ళ నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ అమాయక రైతులను మోసం చేస్తూ, నిషేధిత నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అక్రమ విక్రయాలపై నిరంతరం నిఘా ఉంటుందని, నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. సమర్థవంతంగా దాడులు నిర్వహించి నిందితులను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్కె అన్వార్ పాషా, వారి బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు కేటాయించాలి

: మోకు కనకారెడ్డి



జనగామ, ప్రజాస్ఫూర్తి : మూడో విడత ఇందిరమ్మ ప్లాట్లలో ఇళ్లు కోల్పోయిన 72 మంది లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటా యించాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మా ట్లాడుతూ,గతం లో జీ ప్లస్ టూ ఇండ్లు నిర్మించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి 72 మంది ఇళ్లు తొలగించిందన్నారు. ఇప్పటికైనా వారికి హామీ ప్రకారం ఇళ్లు అప్పగించా లని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జోగు ప్రకాష్, బూడిద గోపి, రాపర్తి రాజు, బొట్ల శేఖర్ పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలి

* మెదక్ ఎస్పీ. శ్రీనివాస రావు




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్ ను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ, కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ.. ముఖ్య కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడాలని అధికారులకు సూచించారు.నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నేర నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.స్టేషన్ రిసెప్షన్ ను పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న రెమావతి ని ఆమె బాధ్యతల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు అండగా నిలుస్తూ, వారి ఫిర్యాదులను సక్రమంగా రాయించడంలో సహకరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయం అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట సీఐ లు సైదా, సందీప్ రెడ్డి, ఎసై శివనందం సిబ్బంది ఉన్నారు.

# గాలివాన బీభత్సం.. కూలిన చెట్లు, స్తంభాలు

* చిట్యాలలో నిలిచిన విద్యుత్ సరఫరా.. తడిసిన ధాన్యం





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : చిట్యాల మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. బలమైన గాలుల ప్రభావంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోగా.. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.మండలంలోని పాఠశాల ఆవరణలో భారీ వేపచెట్టు కూలిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంకట్రావుపల్లి, చింతలపల్లి, పోచమ్మగుడి ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో అక్కడ పార్క్ చేసిన కారు ధ్వంసమైంది.మార్కెట్ లో రైతులు విక్రయాల కోసం తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది జేసీబీల సహాయంతో చెట్లు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాలు దెబ్బతినడంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టి సరఫరా పునరుద్ధరణకు చర్యలు కొనసాగిస్తున్నారు.

# నీటి ఎద్దడిలో ప్రజలకు అండగా 15వ వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్"

* వాటర్ ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వేసవి తీవ్రత పెరగడంతో సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో, స్థానిక 15వ వార్డు కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వార్డులో నీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయిస్తూ, ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నారు.కేవలం ట్యాంకర్లు పంపించడం మాత్రమే కాకుండా, నీరు సరైన ప్రాంతాలకు చేరుతున్నదా లేదా, ప్రతి కాలనీ ప్రజలకు సమానంగా అందుతున్నదా అనే అంశాలను దగ్గరుండి స్వయంగా పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు నీటి కోసం ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటుండటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్ చురుకైన పాత్ర పోషించడం పట్ల 15వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



నీటి కొరత సమయంలో అందుబాటులో ఉండి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న పిల్లల భవాని రమేష్ పనితనం అభినందనీయమని పలువురు స్థానికులు పేర్కొన్నారు. ఇలాంటి సేవా భావంతో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులు అవసరమని వార్డు వాసులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# అంతరించి పోతున్నా జీవ వైవిద్యాన్ని కాపాడుకుందాం

* **పకృతి ప్రేమికుడు, తెలంగాణ రాష్ట్ర వాల్టా అథారిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు.ధైద వెంకన్న.**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ చంద్రన్ గుట్టలో సోమవారం రాత్రి దాసరి హరిబాబు,రేణుక దంపతుల 25 సంవత్సరాల పెళ్లి రోజు వేడుకల్లో వారికి శుభాకాంక్షలు తెలిపి మొక్కను బహుకరించిన హరిత మిత్ర అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర వాల్టా అథారిటి రాష్ట్ర కమిటీ సభ్యుడు ధైద వెంకన్న.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఈ రోజు ప్రజలు ఎండ కాలంలో వేడిని తట్టుకోలేక పిట్టల్ల రాలి పోతున్నారు. కొంత మంది ఏసీని ఆశ్రయిస్తున్నారు,ఈ రోజు భారతదేశంలో 500 కోట్ల చెట్ల అవసరం ఉంది. 45 డిగ్రీల నుండి 49 డిగ్రీల వరకు ఉంటేనే తట్టుకోలేక పోతున్నాము. అదే 55 డిగ్రీల నుండి 60 డిగ్రీల వరకు మారడానికి ఎక్కువ సమయం పట్టదు,56 డిగ్రీల వద్ద మానవులు మనుగడ సాగించలేరు, మనం దీనిని అర్థం చేసుకుని ప్రతి ఒక్కరు ఇప్పటి నుంచే మొక్కలు నాటాలి.ఒక మొక్క పెరగడానికి 5 నుండి 7 సంవత్సరాలు పడుతుంది,అదే 2 సంవత్సరాల మొక్కను నాటండి.ఇప్పుడు వర్షాలు కురుస్తాయి, ఖచ్చితంగా రెండు మొక్కలు నాటండి,ఇది కూడా ఏ మొక్కలు పడితే అది నాటవద్దు. కానుగ,నేరేడు,వేప, రేలా,పొగడ,చింత,నల్ల తుమ్మ,తెల్ల మద్ది ఈ మొక్కలు మాత్రమే నాటాలి ఎందుకంటే వర్ష కాలంలో గాలి దుమరానికి పెడుసు చెట్లు విరుగుతున్నాయి. కాని పైన ఉన్న చెట్లు విరుగవు అని అన్నారు. అలాగే ప్రతిదీ ప్రభుత్వామే చేస్తుంది అని వదిలివేయకుండా మన బాధ్యత అనుకోని మొక్కలు నాటలని అన్నారు.ప్లాస్టిక్ కవర్లు నిషేధం కోసం కృషి చేస్తూనే ఎక్కడికి ఏ పంక్షన్ కు వెళ్లిన ఒక సంచిలో స్టిల్ ప్లేట్,స్టిల్ గ్లాస్ తిడుకొని వెళ్లి ఆ ప్లేటులోనే భోజనం చేస్తు విన్నుతా కార్యక్రమంతో అందరికి ఆదర్శంగా నిలుస్తున్న ప్రకృతి మనిషి ధైద వెంకన్న ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కుటుంబ సభ్యులు కోమిరే ఉప్పలయ్య,దోసపాటి మల్లయ్య,పిరోజ్ గణేష్,చాగంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌తో పోరాడుతున్న రాజుకు గండ్ర భరోసా

* **యశోద ఆస్పత్రిలో పరామర్శ.. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా. ప్రజాస్ఫూర్తి : చిట్యాల మండల కేంద్రానికి చెందిన గంగాధర రాజు అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్న రాజుకు ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై రాజు ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, వైద్యపరమైన జాగ్రత్తలు, భవిష్యత్ చికిత్స విధానంపై చర్చించారు. రాజుకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అందరూ ఆయనకు అండగా ఉన్నారని గండ్ర భరోసా ఇచ్చారు. రాజు త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకున్న విషయం తెలిసి పలువురు కార్యకర్తలు, అభిమానులు కూడా అక్కడికి చేరుకుని రాజు ఆరోగ్యంపై ఆరా తీశారు. గండ్ర చేసిన పరామర్శతో కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.

# రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కుంభం



భువనగిరి ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని నల్గొండ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులని ప్రారంభించిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ రోడ్డు విస్తీర్ణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అంతేకాకుండా భువనగిరి పట్టణంలో అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు రాబోయే రోజుల్లో పట్టణంలో ఎలాంటి సమస్యలు లేకుండా సుందరంగా అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి - రవికుమార్ వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల - వెంకటేశ్వర్లు భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఫారెస్ట్,అసైన్డ్ రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

* **మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్,**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ, అసైన్డ్ వ్యవసాయ భూముల పరిష్కార సమన్వయ సమావేశం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్,లఅధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్,తహసిల్దార్లు, ఏడి సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ అసైన్డ్ భూ సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పరిష్కరించాలని తద్వారా పేద ప్రజల మనసుల్లో అధికారులు ఉంటారని తెలిపారు, అందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. జెన్ సిపాయి భూములు మొదటి వార్ లో తరతరాల నుండి వారికి వచ్చాయని, అట్టి మండలాలు నెల్లికుదురు,నరసింహ గూడెం సుమారు 250 ఎకరాలు ఉంటాయన్నారు,సీతానగారం, గుండెంగా, ముదుపుగల్, నారాయణపురం, నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి చిన్న చిన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టులో ఉన్న భూ సమస్యల కోసం కలెక్టర్ హైదరాబాద్ స్థాయి, భూ పరిపాలన కమిషనర్ చే చర్చించి ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన నిరుపేద వారికి అందించాలని ఆయన కోరారు,గతంలో రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని నిజమైన లబ్ధిదారులు ప్రస్తుతం ఉన్నారని వారిని మాత్రమే గుర్తించాలని, పేద ప్రజలకు సహాయం చేస్తే ఉద్యోగ తృప్తి లభిస్తుంది అని ఎమ్మెల్యే తెలిపారు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు,పని ఒత్తిడి ఉన్న గాని ప్రత్యేకంగా ఈ భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు,ఈ సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి,రెవెన్యూ, సర్వే సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# కిషోర్ రెడ్డి అన్నా జెర దేకో....!

* **చలి వేంద్రాల నిర్వహణ లోపం...:**
* **ఆలోచన గొప్పదే ..ఆచరణలో లోపం....:**
* **షాపూర్ నగర్, గండిమైసమ్మ చౌరస్తాలో కాలి ఫ్లెక్సీలే దర్శనం...:**







ప్రజాస్ఫూర్తి, దుండిగల్: ప్రజల దాహర్తిని తీర్చాలానే ప్రజా నాయకుల లక్ష్యం గొప్పదే అయినా తమ అనుచర గణం నిర్లక్ష్యంతో అది నీరుగారుతుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అశేష అభిమాన గణం,ప్రజా అభిమానం చురగొన్న యువనేతగా బొంగునూరి కిషోర్ రెడ్డి టాక్ఆఫ్ ది కుత్బుల్లాపూర్ గా పేరుగడించాడు. ఇటీవలే స్టేట్ ప్రోటోకాల్ & కో ఆర్డినేషన్ వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన కిషోర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరావేసెలా కృషి చేస్తున్నాడు.వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేలా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతగా నియోజకవర్గ పరిధిలోని పలు కూడళ్ళలో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాట్లు చేసారు. ప్రజలకు సేవ చేయాలనే నాయకుడి లక్ష్యం గొప్పదే అయినా ఆచరణలో మాత్రం కొన్ని లోపాలు ఉన్నట్టుగా స్పష్టంగా కనిపిస్తుంది.కాంగ్రెస్ నాయకుడు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రాలలో చల్లటి సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నా శాపూర్ నగర్,గండి మైసమ్మ చౌరస్తాలో చలివేంద్రాలలో మాత్రం నిర్వహణ లోపం ఉన్నటుగా కనిపిస్తుంది.మండు వేసవిలో కాసిన్ని మంచినీరు తాగేందుకు బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు వచ్చేవారికి అక్కడ కేవలం ఫ్లెక్సీలే దర్శనం ఇస్తూ మంచినీరు లేకపోవడంతో చలివేంద్రం ఇలా నిర్వహిస్తున్నారేంటి అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. గొప్ప ఆశయంతో ఆ నాయకుడు తీసుకున్న నిర్ణయం క్షేత్ర స్థాయిలో నిర్వహణ లోపంతో అబాసుపాలవుతుందని ఇప్పటికైనా కిషోర్ రెడ్డి చలివేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు!


# కుక్కల దాడిలో మృతిచెందిన మహిళకు సీపీఐ నివాళి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కుక్కల దాడిలో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరమని, బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్. కే. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీ చాటివారిగూడెం గ్రామపంచాయతీకి చెందిన మారె రాములమ్మ (50) అనే మహిళ కుక్కకాటుతో మృతి చెందగా, మంగళవారం ఆమె భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగిపోయిందని, కుక్కకాటు వల్ల ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాములమ్మ మృతి పట్ల తన గాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు గట్టి చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. నివాళులర్పించిన వారిలో జ్యోతిబసు, పిచ్చయ్య, మిరియాల రాము, లక్ష్మయ్య, జాన్సన్, క్రాంతి, రాజేష్ కళ్యాణ్ జ్ఞానముత్యం తదితరులు ఉన్నారు.

# రైతు గోస–బీజేపీ భరోసా, జనగామ మార్కెట్ యార్డ్‌లో బీజేపీ బృందం పర్యటన

* **రైతుల సమస్యలపై ఆరా..**



జనగామ, ప్రజాస్ఫూర్తి: 'రైతు గోస బీజేపీ భరోసా' కార్యక్రమం లో భాగంగా తెలంగాణ బీజేపీ ప్రతినిధుల బృందం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఆధ్వ ర్యంలో జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించింది. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి న నాయకులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణం గా తెలంగాణ రైతాంగం తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటోందని విమర్శించారు. ముందస్తు కొనుగోలు ఏర్పాట్లలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిం చారు. బీజేపీ పర్యటన ప్రకటించిన తర్వాతే ప్రభుత్వం సమస్య తీవ్రతను గుర్తించి చర్యలకు దిగిందని అన్నారు. బీజేపీ నాయకులు కొనుగోలు కేంద్రానికి చేరుకునే ముందే హడా వుడిగా ధాన్యా న్ని లారీల్లో నింపి,అన్నీ సక్రమంగా జరు గుతున్నాయనే భావన కల్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నిన్ననే కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు చేరాయని రైతులు తెలిపారని, ధాన్యం ఎత్తివేత కోసం లారీలు పంపిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చిన విషయాన్ని కూడా రైతులు వెల్లడించారని పేర్కొన్నా రు.బీజేపీ ఈ సమస్యను బలంగా లేవ నెత్తినందుకే ప్రభుత్వం స్పందించి చర్య లు చేపట్టాల్సి వచ్చిందన్నారు. లేదంటే ఆరుబయట నిల్వ ఉంచిన వరి, మొక్క జొన్న ధాన్యం వానకు తడిసి, ఎండకు ఎండిపోయే పరిస్థితి కొనసాగేదని తెలి పారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తగిన ప్రతిఫలం దక్క కుండా పోయేదని ఆవేదన వ్యక్తం చేశా రు. తెలంగాణ రైతుల హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ప్రతి రైతుకు కనీస మద్దతుధర (ఎం.ఎస్.పి) లభించే వరకు, పండించిన ప్రతి గింజ ను ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేసే వరకు తమ పోరా టం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యేలు వెంక టరమణారెడ్డి, రాకేష్, సూ ర్య ప్రకాశ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా, కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీ నర్సయ్య, రాష్ట్ర అధి కార ప్రతినిధి ఆరుట్ల దశ మంత్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్ రెడ్డి, లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తోకల ఉమారాణి, అంజి రెడ్డి, నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, లక్ష్మారెడ్డి, సుజన్, కిసాన్ మోర్చా నాయకులు వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అనిల్, పట్టణ ప్రధాన కార్య దర్శి పెద్దోజు జగదీష్, శివకృష్ణ, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్య దర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భవిష్యత్తు కోసం సమాజం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది

* **రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి**

భువనగిరి ప్రజాస్ఫూర్తి, ప్రజాస్ఫూర్తి : బాలికల భవిష్యత్తు కోసం



సమాజం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి అన్నారు. మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు."బాల్య వివాహాల అవగాహన కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా లో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార రథాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వెంకా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికల హక్కులను పరిరక్షించడం, బాల్య వివాహాలను అరికట్టడం మరియు బాలికలకు విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రచార రథం ద్వారా గ్రామాలలో, సంస్కృతిక కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని, అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి సమాచారం ఇవ్వాలని, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా సంక్షేమ సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, జిల్లా వైద్యాధికారి మనోహర్ జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, సివిల్ సప్లై అధికారి రోజా రాణి, సిడిపిఓ శైలజ, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, సాంస్కృతిక కళా సారధి బృందం సభ్యులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఆశా దీపానికి అండగా సమ్మి గౌడ్, యాసాని బాలారెడ్డి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్త : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కోరుకొండపల్లి గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త స్వరూపను సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మి గౌడ్ పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల శస్త్రచికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న స్వరూప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా స్వరూప భర్త నాగెల్లి వెంకన్న, పిల్లలు వంశితేజ, ఇంద్రతేజ, కుటుంబ సభ్యులు నాగెల్లి జనార్ధన్ రమలను కలిసి ఓదార్పు పలికిన సమ్మి గౌడ్, "కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అంటూ భరోసా ఇచ్చారు. ఆయన చూపిన మానవత్వానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మి గౌడ్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎండనకా, వాననకా సేవలు అందించే ఆశా వర్కర్లు నిజమైన ఆరోగ్య యోధులు. ప్రతి ఇంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులకు అంకితభావంతో సేవలందించే స్వరూపలాంటి కార్యకర్తలు సమాజానికి ఆదర్శం. ఆమె త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో పాల్గొనాలని కోరుకుంటున్నాను" అన్నారు.ఆశ కార్యకర్త స్వరూప చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ, ఆమె త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆమె పాత్ర చిరస్మరణీయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# వడ్ల కొనుగోళ్లపై బిజెపి అపోహలు సృష్టిస్తుంది

* రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ భరోసా యాత్ర
* ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : వడ్ల కొనుగోళ్లపై బిజెపి పార్టీ అపోహలు సృష్టిస్తూ రైతుల్లో గందరగోళం నెలకొనేలా చేస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. గత రెండు పంటల సీజన్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ రైస్ ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం మరింత మెరుగ్గా వడ్ల కొనుగోలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి పంట దిగుబడి నమోదైందని, అధిక దిగుబడి వచ్చినప్పటికీ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం బీజేపీనేనని ఆరోపిస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉద్యమాల తర్వాత వాటిని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు.రైతు భరోసా యాత్రను తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీజేపీ నాయకులకి సూచించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన గానకోకిల బెల్లి లలితక్క

* ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రజలలో పాటలతో ఉద్యమ స్ఫూర్తిని నింపిన గానకోకిల బెల్లి లలితక్క అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి కూరగాయల మార్కెట్ యాడ్ సమీపంలో అమరవీరుల స్తూపం వద్ద బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క తన గానంతో ప్రజల్లో చైతన్యం నింపి ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆమె పాటలు ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించాయని, తెలంగాణ సాధనలో ఆమె చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. భావితరాలకు ఆమె సేవలను గుర్తుచేసే విధంగా ఈ విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ ఛైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, విగ్రహ స్థాపక కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పంచాయతీ కార్యాలయాలే కేంద్రబిందువులు

: ఎమ్మెల్యే గండ్ర



చిట్యాల, ప్రజాస్ఫూర్తి : గ్రామాల సమగ్ర అభివృద్ధిలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు.చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఇజిఎస్) నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం భవనాన్ని పరిశీలించిన ఆయన గ్రామ ప్రజలకు మెరుగైన పాలన, పారదర్శక సేవలు అందించేందుకు ఇలాంటి వసతులు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన సేవలు గ్రామ స్థాయిలోనే అందేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మటిక సుజాత రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ, మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుట్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మధువంశీ కృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాత్రి వేళలోనూ మొక్కజొన్న అన్‌లోడింగ్ చేయాలి: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మొక్కజొన్న అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో కూడా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకోసం తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌తోపాటు ఇల్లందు క్రాస్‌రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌కు చేరుతున్న మొక్కజొన్న లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి వస్తోందని సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గోడౌన్‌లో మొక్కజొన్న నిల్వల అన్‌లోడింగ్ తీరును, బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించి, పూర్తి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా పంటను నిల్వ చేయాలని, ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, పూర్తి స్థితిపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో ప్రారంభమైన పనులు ఇప్పటివరకు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యానికి గల కారణాలను వివరంగా నివేదించాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకున్న కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారతకు వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నల్లగొండ పట్టణంలో తెల్లవారుజామున

# విస్తృత కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణాన్ని అష్ట దిగ్బంధం చేసి నిరంతరం రద్దీ గల ప్రాంతాలు సతీష్ నగర్ తో పాటు ఇతర పలు ప్రాంతాల్లో 10 బృందాలుగా ఏర్పాటు చేసి మంగళవారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానితుల గుర్తింపు, అక్రమ కార్యకలాపాల అరికట్టడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ ఆపరేషన్ నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ఏడు మంది సీఐలు,18 మంది ఎస్.ఐలతో నార్కోటిక్ డాగ్ తో కలిపి సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, పట్టణంలోని పలు కాలనీలు, అనుమానిత ప్రాంతాలు, లాడ్జీలు, అద్దె గదులు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో సుమారు 360 ఇండ్లలో తనిఖీలు నిర్వహించగా, 46 మంది అనుమానితులను గుర్తించి వారి వివరాలు సేకరించి పరిశీలిస్తున్నారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను గుర్తించారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 మంది, బీహార్‌కు చెందిన 4 మంది, తమిళనాడు కు చెందిన 1 వ్యక్తి, అస్సాం కు చెందిన 1 వ్యక్తి, హర్యానాకు చెందిన 2 మంది ఉన్నారు.తనిఖీలలో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లు,5 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అలాగే ఆరుగురికి గంజా టెస్ట్ లు నిర్వహించగా వీరిలో ఇద్దరిని గంజా సేవించినట్లు గుర్తించడం జరిగింది.అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు.సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు (త్రిచక్ర వాహనాలు) వీటిలో అదిక శబ్దం కలిగిన 02 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేస్తున్నారు. అదనంగా 4 సెల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా పోలీసు శాఖ వెల్లడించింది.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి


* తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా పర్యవేక్షించాలి: కలెక్టర్ రాహుల్ శర్మ




భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జాప్యం లేకుండా వేగంగా పూర్తయ్యేలా తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలతో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఇతర జిల్లాలతో పోలిస్తే భూపాలపల్లి జిల్లాలో పంటల కోతలు ఆలస్యంగా జరుగుతాయని, ఈ నెలాఖరులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు స్వచ్ఛందంగా ట్రాక్టర్లతో ధాన్యం తరలిస్తే ట్రాక్టర్ ఛార్జీలు చెల్లిస్తామని తెలిపారు. గోదాముల కొరత తలెత్తకుండా పత్తి మిల్లులను కూడా వినియోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలు ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేసి ధాన్యాన్ని గోదాములు, మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బందిని నియమించి పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని తహసీల్దార్లకు ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా కాంటా వేసిన వెంటనే గన్ని సంచుల్లో నింపి టార్పాలిన్లతో కప్పి భద్రపరచాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. గన్ని సంచులు, టార్పాలిన్ల కొరత తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై కఠిన చర్యలు

* కాళేశ్వరంలో అవగాహన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్ హెచ్చరిక



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళేశ్వరంలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, పిల్లల హక్కులను హరించే సామాజిక దురాచారమని పేర్కొన్నారు. పిల్లలకు విద్య, ఆరోగ్యం, సురక్షిత భవిష్యత్తు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చట్టప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరగాలని తెలిపారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు, చదువు మధ్యలోనే ఆగిపోవడం, గృహహింస, పేదరికం పెరిగే ప్రమాదం ఉందన్నారు. "బాల్య వివాహాల నిషేధ చట్టం-2006" ప్రకారం బాల్య వివాహాలు నిర్వహించిన వారిపై రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 1098 చైల్డ్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషారెడ్డి, భరోసా ఎస్ఐ స్వప్నకుమారి, సీడీపీఓ, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, పురుషులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

* ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో కమిషనర్ సమీక్ష



కాళేశ్వరం, ప్రజాస్ఫూర్తి : రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని దేవాదాయ శాఖ కమిషనర్ తెలిపారు. సరస్వతి అంత్య పుష్కరాల 6వ రోజు సందర్భంగా మంగళవారం కాళేశ్వరంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ తో పాటు ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సరస్వతి పుష్కరాల్లో ఎదురైన లోటుపాట్లను గుర్తించి గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, పార్కింగ్, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీ ఏర్పాట్లపై జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గత ఆది పుష్కరాల్లో పుష్కర ఘాట్లు, టెంట్ సిటీ, ఉచిత షటిల్ బస్సులు, పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురైన నేపథ్యంలో ఈసారి వన్‌వే ట్రాఫిక్ విధానంతో పాటు అదనపు పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. సమావేశంలో ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల కలెక్టర్లు బొర్కడే హేమంత్ సహదేవరావు, కుమార్ దీపక్, సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం ఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# లేజీ విద్యార్థులతో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాలేజీ విద్యార్థులతో 'పోక్సో చట్టం అవగాహన' అనే అంశంపై వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాలల పట్ల లైంగిక నేరాలను అరికట్టడానికి, చట్టాలపై యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించారు .ఈ సదస్సులో పోక్సో కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నుండి సంరక్షించే చట్టం పోక్సో లోని కఠిన నిబంధనలను ఆయన వివరించారు. న్యాయ సేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే ఎదురయ్యే శిక్షలతో పాటు, బాధితులకు చట్టం కల్పించే రక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.భరోసా సబ్ ఇన్స్పెక్టర్ దీపిక రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, తెలియని వారి తో సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత సంభాషణలు, ఫోటోలు షేరింగ్ లు దుర్వినియోగం అవుతునట్లు గమనించాలన్నారు. షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ సునంద మాట్లాడుతూ చదువుకునే వయస్సులో ప్రేమ అనే వ్యామోహం లో భవిష్యతు ను అంధకారంలో పడేస్తున్నారన్నారు. ఏదైనా ఆపద కలిగితే, వేధింపులకు గురైతే ధైర్యంగా వెంటనే న్యాయ సహాయం కోసం అధికారులను సంప్రదించాలని సూచించారు.వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడుతాయాన్నారు. ఈ సదస్సులో సీనియర్ న్యాయవాది చెన్నమల్లా రెడ్డి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ, సఖి అడ్మిన్ శ్రావణి, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# 2017లో 20 ఏళ్ల జైలు శిక్ష.. ఇప్పటికి 16 సార్లు పెరోల్



తన శిష్యురాళ్లు ఇద్దరిపై అత్యాచారానికి ఒడిగట్టిన నేరానికి 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ (డేరా బాబా) మరోసారి పెరోల్‌పై విడుదలయ్యారు. 30 రోజుల పెరోల్ పై మంగళవారం హరియాణాలోని సునారియా జైలు నుంచి బయటకు వచ్చారు. 2017లో అతడికి శిక్ష పడిన నాటినుంచి పెరోల్‌పై తాత్కాలికంగా విడుదలవడం ఇది 16వ సారి. శిక్ష అనుభవిస్తున్న గత 9 ఏళ్లలో 400 రోజులకు పైగా అతడు జైలు బయటే గడిపాడు. ప్రస్తుత పెరోల్ కాలంలో డేరా బాబా సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలోనే ఉంటారని న్యాయవాది జితేందర్ ఖురానా తెలిపారు. 2002లో ఒక జర్నలిస్టు హత్య కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు డేరా బాబాకు యావజ్జీవ కారాగార శిక్ష విధించగా.. ఏడేళ్ల జైలు జీవితం తర్వాత నిర్దోషిగా విడుదలయ్యారు. ఆ తర్వాత, తన శిష్యురాళ్లపై లైంగిక వేధింపుల కేసులో 2017లో గుర్మీత్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. నాటినుంచి జైల్లోనే ఉంటున్నాడు. 2020 నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 సార్లు పెరోల్‌పై విడుదలయ్యారు.

# డ్రైవర్‌పై వేటు వెనక్కి..

## విధుల్లో కొనసాగించాలని పొన్నం ఆదేశం



హైదరాబాద్ : కాంగ్రెస్ నేతల నిరసనపై విమర్శలు చేశాడన్న ఆరోపణలతో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌ను తొలగించడంపై చెలరేగిన వివాదానికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెరదించారు. డ్రైవర్ అశోక్‌పై తీసుకున్న చర్యను వెనక్కి తీసుకోవాలని, అతడిని విధుల్లో కొనసాగించాలని యాజమాన్యానికి సూచించినట్టు ఆయన మంగళవారం తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "డ్రైవర్ అశోక్ ఆర్టీసీ ఉద్యోగి కాదు, కేవలం అద్దె బస్సు డ్రైవర్ మాత్రమే. అయినప్పటికీ, అతను రైతుల పక్షాన మాట్లాడాడు. దానిని మేము స్వాగతిస్తున్నాం. అందుకే అతడిని ఉద్యోగం నుంచి తొలగించవద్దని బస్సు యాజమాన్యానికి సూచించాం" అని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ఈ విషయాన్ని విపక్షాలు రాజకీయం చేయవద్దని హితవు పలికారు.

# కోట్లాది రూపాయల నిధులతో నాలాల అభివృద్ధి

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గారు...



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కోట్లాది రూపాయల నిధులతో కాలనీల గుండా వెళుతున్న మురుగు కాలువకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ సూర్య నగర్, రామిరెడ్డి నగర్ లలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పర్యటించి రామ్ రెడ్డి నగర్ నాలా బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా స్టార్మ్ వాటర్ సమస్య, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనుల సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల లో కోట్లాది రూపాయల నిధులతో మురుగు కాలువలకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. వర్షాకాలంలో కాలనీలలోని ఇళ్లలోకి నీరు చేరకుండా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు.రామ్ రెడ్డి నగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి తరగతిన పూర్తి చేస్తామని, తద్వారా ఇళ్లలోకి వరద నీరు చేరకుండా ఉంటుందన్నారు. బ్రిడ్జి నాలా పనులతో పాటు సూర్య నగర్ లో అంతర్గత సిసి రోడ్లు స్టాం వాటర్ పనులను త్వరగతిన చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు స్థానిక హనుమాన్ దేవాలయం, శ్రీ శక్తిగణపతి దేవాలయంలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ ఏఈ ర[illegible] రెడ్డి, జిహెచ్ఎంసి ఏఈ అభిలాష్, రామ్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదవ రెడ్డి, కార్యవర్గ సభ్యులు హీరాలాల్ బాటి, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్ గౌడ్, సురేష్ కుమార్, రాజన్న, సూర్య నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వి. సురేష్, ఉపాధ్యక్షులు రమణయ్య, కుత్బుల్లాపూర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి బాపూ, వనం శ్రీనివాస్, బొంబాయి శ్రీను, రాకేష్ జలిగం, ఎండి.నజీరుద్దీన్, రమణారెడ్డి, ఆంజనేయులు, అజయ్, వెంకటేష్, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ్, జయం చారి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

* జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు, బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నుండి నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్నిపురస్కరించుకుని మంగళ వారం నల్గొండ పట్టణంలోని రెడ్ క్రాస్ భవనంలోమహిళ ,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహల రహిత తెలంగాణ లక్ష్యంతో "బాల్య వివాహ నిషేధ చట్టం-2006"పై విద్యార్థులకు ఉద్దేశించి నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల అభివృద్ధి కి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలి, బాల్య వివాహాలను అరికట్టేందుకు విద్యార్థులు చైతన్యవంతంగా వ్యవహరించాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలుదెబ్బతింటున్నాయి, కుటుంబాల్లో ఆవేదన మిగులుతున్నదని అన్నారు. విద్యార్థులు తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని, బాలికలు సంఘాలుగా ఏర్పడి తమ సమస్యలను పంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న వెల్ఫేర్ వీక్ ద్వారా పిల్లలకు అనేక అవకాశాలు కల్పిస్తున్నదని, ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని చెప్పారు. బాలికల సమస్యలపై ప్రతి నెల సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు క్యారంస్ ఆడుతుండగా వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు. అవగాహన కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సి డి పిఓ లావణ్య ,సి డబ్ల్యూ సి చైర్మన్ చింత కృష్ణయ్య ,సి డబ్ల్యూ సి సభ్యులు భాస్కర్ వెంకన్న, డిసిపిఓ గణేష్ హాజరయ్యారు.

# నరహరి లొంగుబాటు.. మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి.. తన భార్య దానమ్మతో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈమేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. పసునూరి నరహరిని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సందర్భంగా డీజీపీ మాట్లాడారు. నరహరి లొంగుబాటుతో మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలిందన్నారు. "పసునూరి నరహరి స్వస్థలం హనుమకొండ జిల్లా సోమిడి. డిగ్రీ చదువుతున్న సమయంలో మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లిపోయారు. 1982లో అజ్ఞాత దళ సభ్యుడిగా చేరారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందారు. తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్ల తయారీలో ఆయన నిపుణుడు. సాంకేతిక, సంస్థాగత బాధ్యతలను ఏకకాలంలో నిర్వర్తిస్తూనే.. ఆయుధాల ఉత్పత్తి, మరమ్మతు, నిర్వహణకు సంబంధించి మావోయిస్టు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేవారు. మావోయిస్టు కార్యకలాపాలను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. తెలంగాణకు చెందిన ముగ్గురు నేతలు.. గణపతి, జాడే సుజాత, వార్త శేఖర్ మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయమందిస్తోంది" అని డీజీపీ తెలిపారు.

# దేశంలోకి చొరబాట్లు..అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ




న్యూఢిల్లీ, మే 26: అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పుల ను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు ఒక పెద్ద సవాలుగా మారిందని పేర్కొన్నారు. కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై సమగ్ర మూల్యాంకనం నిర్వహించడం.. మత, సామాజిక వర్గాల స్థాయుల్లో జనాభా మార్పుల సరళిని విశ్లేషించడం ఈ కమిటీ పని అని పేర్కొన్నారు. దేశంలో మారుతున్న జనాభా తీరుపై కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాట్లను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# బండి భగీరథ్‌కు మూడు రోజుల పోలీసు కస్టడీ



హైదరాబాద్: పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మల్కాజిగిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. అతడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు విచారించనున్నారు. వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరగా.. కోర్టు మూడు రోజులకే అనుమతించింది. ఈనెల 16న అరెస్టైన బండి భగీరథ్.. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

## వెళ్లగొట్టకముందే పారిపోండి

# అక్రమ వలసదారులకు సువేందు హెచ్చరిక



ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారులపై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు.

**నిర్బంధ కేంద్రాల ఏర్పాటు..**

బెంగాల్ ప్రభుత్వం "గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి" అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**సరిహద్దు సమీపంలో బంగ్లాదేశీయులు**

అక్రమంగా రాష్ట్రంలోకి వలస వచ్చిన వారిపై బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు తమ స్వదేశానికి పయనమవుతున్నారు. మంగళవారం ఉదయం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకీంపుర్ సరిహద్దు ప్రాంతంలో పదుల సంఖ్యలో బంగ్లాదేశీయులు గుమిగూడినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ చేపట్టిన సమయంలో కూడా ఈ సరిహద్దు నుంచి వందల సంఖ్యలో బంగ్లాదేశ్‌కు వెళ్లినట్లు తెలిపారు.



# వెలుగుమట్ల

## భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి: కవిత

హైదరాబాద్: ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తెలిపారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగుమట్లతో పాటు వికారాబాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిశామని చెప్పారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూ సేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమస్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. న్యాయం జరగకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.

# అమెరికా ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను కూల్చేశాం: ఇరాన్



అమెరికాకు చెందిన ఎంక్యూ9 రీపర్ డ్రోన్ ను కూల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా ఆర్‌క్యూ4 డ్రోన్, F35 యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు తెలిపింది. టెహ్రాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా తీవ్రమైన దాడులు చేసిన నేపథ్యంలో ఈ తరహాలో తిప్పికొట్టినట్లు పేర్కొంది. అమెరికా చేసే ఏ కాల్పుల విరమణ ఉల్లంఘనకైనా ప్రతీకారం తీర్చుకునే చట్టబద్ధమైన హక్కు తమకు ఉందని ఐఆర్‌జీసీ వెల్లడించింది. ట్రంప్ సైనిక చర్యను తిరిగి ప్రారంభిస్తే.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, సైనిక బలగాలపై మరిన్ని ఆశ్చర్యకరమైన దాడులు చేస్తామని హెచ్చరించింది.

* అమెరికాకు ఇక ఏ ప్రదేశమూ సురక్షితం కాదు: మొజ్తాబా

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. శాంతి ఒప్పందంపై చర్చలు జరుగుతుండగా.. అమెరికా దాడులు చేయడాన్ని ఏ మాత్రం సహించబోమని అన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని.. ఇకపై పశ్చిమాసియాలో అమెరికా బేస్‌లకు ఎక్కడా సురక్షిత ప్రదేశం ఉండదని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లను నాశనం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. తన తండ్రి, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతుల్లా ఖమేనీ మరణం తర్వాత కూడా తాము ఏమాత్రం వెనక్కి తగ్గకుండా దేశం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు.

**ఆత్మరక్షణ కోసమే..**

ఇరాన్‌పై తాము ఉద్దేశపూర్వకంగా దాడి చేయలేదని..ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామని అమెరికా అధికారులు పేర్కొన్నారు. సముద్రంలో మందుపాతరలు పరిచేందుకు యత్నిస్తున్న బోట్లను, ఇరాన్ క్షిపణి ప్రయోగ లాంచ్‌ప్యాడ్లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని తెలిపారు. తమ దాడిలో బందర్ అబ్బాస్ పోర్టులోని నేవీ బేస్ కూడా ధ్వంసమైనట్లు వెల్లడించారు.

# అనాథాశ్రమంలో మంచు మనోజ్ సందడి



నటుడు మంచు మనోజ్ పెద్ద మనసు చాటుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆశ్రమాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 'మాతృదేవోభవ' అనాథాశ్రమాన్ని సందర్శించి ఆయన అక్కడ మతిస్థిమితం సరిగ్గా లేని ఒక వ్యక్తికి నిర్వాహకులతో కలిసి హెయిర్ కటింగ్ చేశారు. అనంతరం కొత్త దుస్తులు ఇచ్చారు. ఆశ్రమానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలను విరాళంగా అందజేశారు. సమాజంలో ఎవరూ లేనివారికి అండగా నిలవడం గొప్ప విషయమని మనోజ్ అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆశ్రమానికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితమే 'మాతృదేవోభవ' అనాథాశ్రమం నిర్వాహకులు తనను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ వీడియో పెట్టారని అది చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను రిహాబిలిటేషన్ సెంటర్ స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇక ఇటీవలే మనోజ్ తన భార్యతో కలిసి ఐక్య సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల గొంతుకగా ఉండేందుకు దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దీని కార్యకలాపాల కోసం సొంత నిధులనే వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా రక్తదానం, చిన్నారుల దత్తత.. సహా పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు.



## సినిమా

# సీతమ్మ వయ్యారం

## అర్పిత మెహతా డిజైన్డ్ చీరలో మృణాల్ ఠాకూర్ మెరుపులు!

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు 'సీతామహాలక్ష్మి'గా దగ్గరైన మృణాల్ ఠాకూర్, తన అందం మరియు నటనతో కుర్రకారు క్రష్‌గా మారిపోయారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియాలోనూ అంతే యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తుంటారు. తాజాగా మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు వైరల్‌గా మారాయి. ప్రముఖ డిజైనర్ అర్పిత మెహతా డిజైన్ చేసిన హెవీ ఎంబ్రాయిడరీ లేత ఆకుపచ్చ రంగు చీరలో ఆమె ఎంతో హుందాగా, వయ్యారంగా కనిపిస్తున్నారు. అదే ఎంబ్రాయిడరీ బ్లౌజ్, ట్రైబ్ అమ్రపాలి జువెలరీతో తన లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దుకున్నారు. ఈ అద్భుతమైన చీరను చూస్తుంటే "బహుశా ఇది నా కోసమే డిజైన్ చేశారేమో" అనిపిస్తుందంటూ ఆమె తన సంతోషాన్ని క్యాప్షన్ ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం మృణాల్ తెలుగు, హిందీ భాషల్లో వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. 'సీతారామం' తర్వాత 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీ స్టార్' వంటి చిత్రాలతో అలరించిన ఆమె, ఈ ఏడాది 'డెకాయిట్'తో విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 22వ చిత్రంతో పాటు, మరికొన్ని హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.




# అలరించే 'ప్రియసఖి'.. ఆనంద్, వైష్ణవిల మ్యాజిక్!

హైదరాబాద్, మే 26: యూత్‌ఫుల్ ప్రేమకథలంటే తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి. ఆ కోవలో వస్తున్న మరో ఆసక్తికర చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా విడుదలైన రెండో సింగిల్ 'ప్రియసఖి' సోషల్ మీడియాలో విశేషస్పందన అందుకుంటోంది. మెలోడీ, మనసును హత్తుకునే సాహిత్యం, ఆహ్లాదకరమైన విజువల్స్ తో ఈ పాట యువతను ఇట్టే ఆకట్టుకుంటోంది. '90స్ ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో తనదైన ముద్ర వేసిన దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సాంగ్‌తో అంచనాలు పెంచుకున్న ఈ సినిమాకు, తాజా పాట మరో అదనపు ఆకర్షణగా నిలిచింది.

**భావోద్వేగాల కలబోత..** "జీవితాన్ని మార్చేశావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతు చూపించావే పూల కడలి" వంటి అర్థవంతమైన పదాలతో సాగిన ఈ పాట, ప్రేమలో పడిన యువకుడి మౌన వేదనను, ఆ తపనను ఎంతో అందంగా ఆవిష్కరించింది. గీత రచయిత సురేష్ బనిశెట్టి అందించిన సాహిత్యం మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ముఖ్యంగా, "సూర్యుడు ఎరుగని కొత్త కాంతి ఇది.. చంద్రుడు చూడని కొత్త వెన్నెల ఇది" వంటి చరణాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

**సంగీత మాయాజాలం..** సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ మరోసారి తన మ్యూజికల్ మ్యాజిక్‌ను చూపించారు. గిటార్, ఫ్లూట్ వాద్య పరికరాల మేళవింపుతో పాటను ఎంతో ప్రశాంతంగా, హాయిగా మలిచారు. గాయకుడు కేఎస్ హరిశంకర్ తన స్మూత్ వాయిస్‌తో పాటకు ఎమోషనల్ టచ్ ఇచ్చారు. వోకల్స్‌కు ఎక్కడా ఇబ్బంది కలగకుండా, మ్యూజిక్‌ను సున్నితంగా డిజైన్ చేయడం ఈ పాటలో పెద్ద ప్లస్ పాయింట్.

**కనువిందు చేసే విజువల్స్..** ఈ పాటను లండన్‌లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరించారు. కలర్‌ఫుల్ ఫ్రేమ్స్, రిచ్ సినిమాటోగ్రఫీ పాటను మరో స్థాయికి తీసుకెళ్లాయి. 'బేబీ' సినిమా తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తుండటంతో, వారిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ క్రమంలో 'ప్రియసఖి' సాంగ్ మెలోడీ ప్రియుల రిపీట్ మోడ్ ప్లేలిస్ట్‌లో చేరిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# బుచ్చిబాబు కోసమే 'పెద్ది' చేశా : దివ్యేందు శర్మ

'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. ''నేను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు'' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..''స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చింది'' అని చెప్పారు.





# రామ్ చరణ్ 'పెద్ది' డబ్బింగ్ పూర్తి చేసిన జగ్గూభాయ్!





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి ఒక ముఖ్యమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో అప్పలసూరి అనే కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ నటుడు జగపతి బాబు తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ తమ 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించింది. "మా జగపతి బాబు గారు అప్పలసూరిగా మారడం చూడండి. 'పెద్ది' కోసం ఆయన తన డబ్బింగ్ పూర్తి చేశారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తున్నాం" అంటూ పోస్ట్ చేసింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాపై మొదటి నుంచి భారీ ఆసక్తి ఉంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఈ అంచనాలను మరింతగా పెంచింది. క్రీడలు, భావోద్వేగాల కలబోతగా ఉన్న ఈ ట్రైలర్‌లో రామ్ చరణ్ ఒక బహుముఖ క్రీడాకారుడిగా కనిపించారు. క్రికెట్, రెజ్లింగ్ వంటి క్రీడల్లో రాణిస్తూ, పల్లెటూరిలో అందరి అభిమానం సంపాదించుకునే యువకుడిగా ఆయన పాత్ర ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, శివ రాజ్‌కుమార్, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. జూన్ 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.